ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



తమిళనాడు
TAMILNADU

మంగళవారం 6 ఫిబ్రవరి 2024

ప్రజాభిప్రాయం కోసం...

● డీఎంకే, అన్నాడీఎంకేల పర్యటనలు షురూ



వివరాలు సేకరిస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

ప్యారీస్, ఫిబ్రవరి 5: పార్లమెంటుకు త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మేనిఫెస్టోలో పొందుపరచాల్సిన అంశాలపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకొనేందుకు అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేలు రాష్ట్రాల్లో పర్యటనలు ప్రారంభించాయి. రాష్ట్రంలో మొత్తం 39 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఈ రెండు పార్టీల ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీలు ఆటో డ్రైవర్లు, కూలీలు, రైతులు, వ్యాపారులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఉద్యోగులు, వివిధ సంఘాలు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులతో సమావేశమై వారి అభిప్రాయాలు సేకరించి తమ పార్టీ అధిష్ఠానాలకు నివేదికగా సమర్పించనున్నాయి. ఇందులో భాగంగా సోమవారం తూత్తుకుడి జిల్లాలో డీఎంకే, దక్షిణ చెన్నైలో అన్నాడీఎంకేల ఎన్నికల మేనిఫెస్టో కమిటీలకు ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు.

తూత్తుకుడిలో...

డీఎంకేలో ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ చైర్మన్, ఎంపీ కనిమొళి నేతృత్వంలో ఆ పార్టీ సీనియర్ నేతలు టీకేఎస్ ఇళంగోవన్, ఏకేఎస్ విజయన్, మంత్రి పీటీఆర్ పళనివేలు త్యాగరాజన్, ఎంపీ రాజేష్‌కుమార్, ఎమ్మెల్యే ఎళిలరసన్, చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ తదితరులు తూత్తుకుడి మాణిక్యం హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కనిమొళి మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు 11 మంది సభ్యులతో కూడిన ఎన్నికల మేనిఫెస్టో కమిటీ తూత్తుకుడిలో పర్యటనకు శ్రీకారం చుట్టిందన్నారు. మంగళవారం కన్నియాకుమారి, 7న మదురై, 8న తంజావూరు, 9న సేలం, 10న కోయంబత్తూర్, 11న తిరుప్పూర్, 16న హోసూరు, 17న వేలూరు, 18న ఆరణి, 20న విల్లుపురం, 21 నుంచి 23వ తేది వరకు చివరగా చెన్నై, శివారు ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. తమ కమిటీ ఈ ప్రాంతాల్లో ఏర్పాటుచేసే సభల్లో పాల్గొనదలచని ప్రజలకు ముందుగానే సమాచారం తెలియజేయాల్సిందిగా ఆయా జిల్లాల పార్టీ నిర్వాహకులకు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. కాగా తమ మేనిఫెస్టో ప్రజాకర్షణగా ఉంటుందని కనిమొళి తెలిపారు.

దక్షిణ చెన్నైలో...

అన్నాడీఎంకే ఎన్నికల మేనిఫేస్టో తయారీ కమిటీ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర మాజీ మంత్రి నత్తం విశ్వనాథన్ నేతృత్వంలో సోమవారం ఉదయం దక్షిణ చెన్నై పరిధిలోని వేలప్పన్‌చావిడిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఇందులో మాజీ మంత్రులు సి.పొన్నయ్యన్, డి.జయకుమార్, పి.బెంజిమెన్, సెమ్మలై, పి.వలర్మతి, ఆర్బీ ఉదయకుమార్, వైగై సెల్వన్, మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్, గోకుల ఇందిర, బీవీ రమణ, మాధవరం మూర్తి, వి.సోమసుందరం, టీకేఎం చిన్నయ్య, ఎస్.అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో తమిళనాడు ఆటో కార్మిక సంక్షేమ సంఘం తరఫున ఏర్పాటైన ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం మత్స్యకారుల సంఘం, నేత కార్మికుల సంఘం, చిన్న, మధ్యతరహా పరిశ్రమల నిర్వాహకులు, మహిళలు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, అసంఘటిత కార్మికులు, టీచర్ల సంఘ ప్రతినిధులు, రెసిడెన్షియల్ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. కార్యక్రమం అనంతరం నత్తం విశ్వనాథన్, డి.జయకుమార్ మీడియాతో మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమి రెండంకెల స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు జరగకపోవడంతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా తమ పార్టీ మేనిఫెస్టో రూపొందిస్తామని తెలిపారు.



వినతి పత్రాలు స్వీకరిస్తున్న అన్నాడీఎంకే మేనిఫెస్టో కమిటీ

జన్మభూమికి సాయం చేయండి

● స్పెయిన్ తమిళులకు సీఎం స్టాలిన్ పిలుపు



స్పెయిన్ తమిళుల సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమిళులు ఏ దేశంలో ఉన్నా జన్మభూమిని మరచిపోకుండా రాష్ట్రాభివృద్ధికి విరివిగా సాయం అందించాలని స్పెయిన్‌లో నివసిస్తున్న తమిళులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరుగుతున్న ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొనే నిమిత్తం ఆయన స్పెయిన్‌లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'స్పెయిన్ తమిళులతో ముఖ్యమంత్రి' అంటూ ప్రత్యేక సభను నిర్వహించారు. ఈ సభకు స్పెయిన్‌కు చెందిన తమిళ ప్రముఖులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. సభలో స్టాలిన్ ప్రసంగిస్తూ... వారం రోజులుగా తాను స్పెయిన్ అంతటా పర్యటిస్తున్నా విదేశీ పర్యటనలో ఉన్నాననే తలంపు లేకపోయిందని, అన్ని చోట్లా తనకు తమిళులు ఎదురై పలకరించడం సంతోషంగా ఉందన్నారు. స్పెయిన్‌లో తొలిసారిగా పర్యటించినా ఇదివరకే తాను పలుమార్లు ఈ దేశంలో పర్యటించినట్లు అనిపిస్తోందని చెప్పారు. స్పెయిన్‌లోని తమిళ ప్రముఖులు, వాణిజ్యవేత్తలు ఘనస్వాగతం పలకడం మరచిపోలేనన్నారు. తమిళులు ఏ మారుమూల దేశంలో ఉన్నా వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ ప్రభుత్వం ప్రవాస తమిళుల సంక్షేమ సంస్థను సమర్థవంతంగా నడుపుతోందన్నారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విదేశాల్లో తమిళుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటివరకూ విదేశాల్లో ఉన్న తమిళులను మూడుసార్లు రాష్ట్రానికి రప్పించి, వారితో సమావేశాలు జరిపి సమస్యలను అడిగి తెలుసుకున్నామని స్టాలిన్ చెప్పారు. అదే విధంగా ఇటీవల జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడు ద్వారా భారీగా విదేశీ పెట్టుబడులను సమీకరించి రాష్ట్రానికి ఘనకీర్తిని కల్పించామన్నారు. ఆ సందర్భంగా వివిధ దేశాల నుండి తమిళ వాణిజ్యవేత్తలు, కంపెనీల ప్రతినిధులు తమతో సమావేశమయ్యారని చెప్పారు. ఇక స్పెయిన్ ప్రజలు తనపై చూపిన ఆదరాభిమానాలను ఎన్నటికీ మరచిపోలేనని తెలిపారు. ఈ సమావేశంలో స్టాలిన్ సతీమణి దుర్గాస్టాలిన్, మంత్రి టీఆర్‌బీ రాజా, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ ఉమానాథ్, స్పెయిన్‌లోని భారతీయ రాయబారి దినేష్‌పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. గత వారం రోజులుగా స్పెయిన్‌లో ఫ్యాంట్, షర్టు, కోటు ధరించిన స్టాలిన్ తమిళుల సమావేశంలో పట్టు చొక్కా, ధోవతిని ధరించి పాల్గొన్నారు.



మాడ్రిడ్ నగర అందాలను తిలకిస్తున్న సీఎం

సట్లెజ్ నదిలో కారు బోల్తా

మాజీ మేయర్ సైదై దురైసామి కుమారుడి గల్లంతు

● డ్రైవర్ మృతి

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హిమాచల్‌ప్రదేశ్‌కు స్నేహితుడితో కలిసి విహారయాత్రకు వెళ్లిన అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే, చెన్నై కార్పొరేషన్ మాజీ మేయర్ సైదై దురైసామి కుమారుడు సట్లెజ్ నదిలో గల్లంతయ్యారు. చెన్నైకి చెందిన సైదై దురైసామి కుమారుడు వెట్రి దురైసామి తమిళ సినీ దర్శకుడిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. విదార్థ్, రమ్యానంబీశన్ జంటగా నటించిన 'ఎండ్రావదు ఒరు నాల్' అనే తమిళ చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఓ క్రైం థ్రిల్లర్ తమిళ సినిమాకు ఆయన దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమా కోసం లోకేషన్స్ చూడటానికి ఆదివారం తన స్నేహితుడైన తిరుప్పూరుకు చెందిని గోపీనాథ్‌తో కలిసి హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు కారులో బయలుదేరి వెళ్లారు. ఆదివారం సాయంత్రం అక్కడి సట్లెజ్ నదీ సమీపంలోని ఘాట్‌లో వెళుతుండగా ఉన్నట్టుండి కారు అదుపుతప్పి ఆ నదిలోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో కారు డ్రైవర్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సైదై దురైసామి కుమారుడు వెట్రి దురైసామి నదీ ప్రవాహంలో గల్లంతయ్యాడు. ఆయనతో పాటు కారులో ప్రయాణించిన గోపీనాథ్ తీవ్రగాయాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం గురించి తెలుసుకుని పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గోపీనాథ్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి, డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించా రు. అగ్నిమాపక దళం సభ్యులు, గజ ఈతగాళ్లు నదిలో గల్లంతయిన వెట్రి దురైసామి కోసం గాలిస్తున్నారు. ఈ వివరాలను హిమాచల్‌ప్రదేశ్ పోలీసులు రాష్ట్ర పోలీసులకు అందించారు. వెట్రి దొరైసామి సట్లెజ్ నదిలో గల్లంతయిన సమాచారం తెలుసుకుని సైదై దొరైసామి, కుటుంబ సభ్యులు శోకతప్తులయ్యారు. రాష్ట్ర పోలీసుల కోరిక మేరకు సోమవారం మధ్యాహ్నం నుంచి హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన గజ ఈతగాళ్ళ ద్వారా అక్కడి పోలీసు, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు వెట్రి దురైసామి ఆచూకీ కోసం సట్లెజ్ నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.



గల్లంతైన వెట్టి దురైసామి - సట్లెజ్ నదిలో గాలిస్తున్న అగ్నిమాపక దళం సభ్యుడు

25న ప్రధాని మోదీ పల్లడం రాక

● బీజేపీ రాష్ట్ర చీఫ్ అన్నామలై ప్రకటన



అమింజికరై అయ్యావు మహల్‌లో ఎన్నికల కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీజేపీ నేతలు అరవింద్ మేనన్, అన్నామలై తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'ఎన్ మన్.. ఎన్ మక్కల్' పేరుతో తాను జరుపుతున్న పాదయాత్ర ముగింపు సభలో పాల్గొనే నిమిత్తం ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 25న తిరుప్పూరు జిల్లా పల్లడం ప్రాంతానికి విచ్చేయనున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. సోమవారం ఉదయం అమింజికరైలోని అయ్యావు మహల్‌లో ఎన్నికల కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది. ఈ లోక్‌సభ ఎన్నికల పార్టీ కార్యాలయాన్ని బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జి అరవింద్ మేనన్, రాష్ట్ర ఎన్నికల కోఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరునాగరాజన్ సమక్షంలో అన్నామలై ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 2019లో జరిగిన తరహాలోనే ఈసారి కూడా ఏప్రిల్ రెండో వారంగానీ, మూడో వారంగానీ లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. దశాబ్దాల తరబడి పార్టీకోసం శ్రమిస్తున్నవారి కలలు నెరవేరే తరుణం ఆసన్నమైందన్నారు. ఇక 75 రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో ఈలోగా పార్టీ శ్రేణులంతా అభ్యర్థుల గెలుపుకోసం పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. తన పాదయాత్ర ద్వారా ఇప్పటివరకూ 183 శాసనసభ నియోజకవర్గాలలో పర్యటించానని, 200వ నియోజకవర్గంగా చెన్నైలో పాదయాత్రను ఈ నెల 11న జరుప తలపెట్టానని చెప్పారు. ఆ పాదయాత్రలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొంటారని చెప్పారు. ఇక 234వ నియోజకవర్గంగా తిరుప్పూరులో తన పాదయాత్రను ముగించనున్నానని తెలిపారు. తన సుదీర్ఘ పాతయాత్రలో ఆయా నియోజకవర్గాలలో మోదీ పథకాలలో లబ్ధిపొందిన వందమందిని గుర్తించి, వారిలో పదిమందిని సభా వేదికపై మాట్లాడే అవకాశం ఇచ్చానని అన్నామలై వివరించారు.

పల్లడం సభకు 10 లక్షలమంది...

తన పాదయాత్ర ముగియనున్న తిరుప్పూరు జిల్లా పల్లడం వద్ద ప్రధాని మోదీ పాల్గొననున్న సభకు పది లక్షలమందిని తరలించనున్నామని అన్నామలై చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోందన్నారు. అయోధ్యలో రామాలయ కుంభాభిషేకం తర్వాత తన పాదయాత్రలో ప్రజలంతా తమ పార్టీ వైపు మొగ్గుచూపుతున్నట్లు తనకు అవగతమైందని చెప్పారు. గత 31 మాసాలుగా డీఎంకే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు ఓటర్లు తగిన గుణపాఠం చెప్పనున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల వల్ల రాష్ట్రంలో ప్రభుత్వం మారదని, అయితే అధికారపార్టీకి మంచి గుణపాఠం లభిస్తుందన్నారు. రాష్ట్ర బీజేపీ ఎన్నికల కమిటీ సమన్వయకర్తలుగా చక్రవర్తి, డిప్యూటీ సమన్వయకర్తలుగా నారాయణన్ తిరుపతి, నరేంద్రన్, నాచ్చియప్పన్ నియమితులైనట్లు అన్నామలై ప్రకటించారు.

వందే భారత్‌పై రాళ్ల దాడి

● ఐదు బోగీల అద్దాలు ధ్వంసం



రాళ్ల దాడిలో ధ్వంసమైన కిటికీ అద్దాలు

పెరంబూర్, ఫిబ్రవరి 5: తిరునెల్వేలి సమీపంలో వందేభారత్ రైలుపై ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసరడంతో కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. నెల్లై - చెన్నై వందేభారత్ రైలు ప్రతిరోజు తిరునెల్వేలిలో ఉదయం 6 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.50 గంటలకు చెన్నై చేరుకుంటుంది. మరో మార్గంలో చెన్నైలో మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి రాత్రి 10.40 గంటలకు నెల్లై చేరుకుంటుంది. ఆదివారం యథావిధిగా మధ్యాహ్నం 2.50 గంటలకు చెన్నైలో బయల్దేరిన రైలు రాత్రి 10 గంటల సమయంలో గంగైకొండాన్ సమీపంలో వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు రైలుపై రాళ్లు విసిరారు. ఈ ఘటనలో ఐదు బోగీల కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు.

పుదుచ్చేరి నుంచి తమిళిసై పోటీ?

● బీజేపీ సన్నాహం



పుదుచ్చేరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పుదుచ్చేరి నుంచి పోటీ చేయనున్నట్లు తెలిసింది. తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలిగా కూడా వ్యవహరించిన తమిళిసై పార్టీని కిందిస్థాయి కార్యకర్తల్లోకి తీసుకెళ్లారన్న పేరుంది. దీని కి తోడు తన పుట్టింటివారంతా కాంగ్రెస్ వెంట నడిచి నా ఆమె మాత్రం బీజేపీనే నమ్ముకుని పని చేశారు. తను నమ్మిన సిద్ధాంతం మేరకు బీజేపీ ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించారు. అందుకే ఆమె ఎన్నికల్లో ఒక్కసారి కూడా విజయం సాధించకపోయినా బీజేపీ అధిష్ఠానం తమిళిసైను తెలంగాణ గవర్నర్‌గా నియమించింది. అంతేగాక పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు అప్పగించింది. అప్పటి నుంచి రెండు రాష్ట్రాల్లోనూ ఆమె తనదైన శైలిలో నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వంతో పొసగకపోయినా, పుదుచ్చేరిలోని ఎన్.రంగస్వామి నేతృత్వంలోని ప్రభుత్వంతో ఆమె సన్నిహితంగా మెలగుతున్నారు. కొన్ని నిర్ణయాలు తీసుకోవడంలోగానీ, కేంద్రం నుంచి నిధులు రప్పించడంలోగానీ ఆమే క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పుదుచ్చేరిలోని అన్ని ప్రాంతాల్లోనూ కలియతిరుగుతూ తనదైన ముద్రవేస్తున్నారు. పుదుచ్చేరివాసులతో నేరుగా మాట్లాడుతూ వారి సమ్యలు తీరుస్తున్నారు. తమిళనాడు పొరుగునే వున్న రాష్ట్రం కావడం, అక్కడ కూడా తమిళమే మాతృభాషగా ఉండడం తదితరాల కారణంగా ఆమె పుదుచ్చేరి ప్రజలతో మమేకమైపోయారు. ఈ నేపథ్యంలో తమిళిసై పుదుచ్చేరి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరఫున పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. నిజానికి ఆరు నెలల నుంచే ఆమె గవర్నర్ గిరీ నుంచి తప్పుకుని, లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగుతారంటూ కథనాలు వెలువడుతున్నప్పటికీ ఆమె స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఆమె ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. అదే సమయంలో పుదుచ్చేరి నుంచి బీజేపీ పోటీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రంగస్వామి సైతం ప్రకటించారు. దీంతో ఇక్కడి నుంచి తమిళిసై పోటీ చేయడం ఖాయమని బీజేపీ, ఎన్ఆర్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక్కడి నుంచి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పోటీ చేస్తారని కూడా చాలాకాలంగా ప్రచారం జరుగుతోంది. కానీ హఠాత్తుగా తమిళిసై పేరు పుదుచ్చేరి నుంచి వినిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే తమిళిసై గవర్నర్ పదవికి రాజీనామా చేసి, ఎన్నికల బరిలోకి దిగుతారని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. పుదుచ్చేరిలో తమిళిసైకి ఉన్న క్రేజ్‌ని పరిగణనలోకి తీసుకున్న తరువాతే బీజేపీ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

పోర్చుగల్ కిక్ బాక్సింగ్ విజేత సుప్రజ

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పోర్చుగల్‌లో జరుగుతున్న కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో సిమట్స్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వీఎస్ సుప్రజ విజేతగా నిలిచింది. లైట్ కాంటాక్స్, కిక్‌లైట్ విభాగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి ఛాంపియన్‌షిప్ టైటిల్ కైవసం చేసుకుంది. 2019లో కిక్ బాక్సింగ్ ప్రారంభించిన ఆమె.. వేగంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. ఐదుమార్లు జాతీయ బంగారు పతక విజేతగా నిలిచింది. అంతేగాక తమిళనాడు నుంచి తొలి మహిళా కిక్ బాక్సర్‌గా చరిత్ర సృష్టించింది.



సమాచార దర్శిని

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 5: స్థానిక మైలాపూర్, కేకేనగర్, అంబత్తూర్, తండయార్‌పేట మండలాల్లో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ గ్రీవెన్స్ జరగనుంది. వళ్లువర్‌కోట్టంలో ఉన్న ఉప విద్యుత్ కేంద్రంలో మైలాపూర్ ప్రాంతానికి చెందిన ప్రజలు, కేకేనగర్ ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో అదే ప్రాంతానికి చెందిన ప్రజలు, అంబత్తూర్, తండయార్‌పేట ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణాల్లో జరిగే శిబిరాల్లో ఆయా ప్రాంతాలకు చెందిన వారు పాల్గొని, తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

నేడు రవాణా కార్మికుల ఆందోళన

ఐసిఎఫ్, ఫిబ్రవరి 5: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 6న మంగళవారం రవాణా కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టనున్నాయి. ఈనెల 7వ తేది అధికారులతో జరిగే చర్చల్లో వేతన ఒప్పందం వంటి డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆందోళన చేపట్టనున్నామని అన్నా కార్మిక సంఘం కార్యదర్శి కమలకన్నన్ తెలిపారు.

పది ప్రాంతాల్లో కార్చిచ్చు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 5: రాష్ట్రంలోని పది ప్రాంతాల్లో ఆదివారం కార్చిచ్చు ఏర్పడినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. యేటా జనవరి నుంచి మార్చి వరకు కార్చిచ్చు ఏర్పడడం కొన్నేళ్లుగా పెరుగుతూ వస్తోంది. మంచు కారణంగా తడిసిన గడ్డి పగలు ఎండకు త్వరగా ఎండిపోతోంది. సులభంగా నిప్పంటుకొనే గుణం కలిగిన ఈ గడ్డిపరకల వల్ల కార్చిచ్చులు ఏర్పడుతున్నాయి. వీటిని అడ్డుకొనేందుకు అటవీ ప్రాంతాల్లో రహదారిని ఆనుకొని 10-15 అడుగుల వెడల్పులో పొదలు తొలిగించినా, కార్చిచ్చు ఏర్పడడాన్ని అడ్డుకోవడం సాధ్యం కావడం లేదు. ఆదివారం కృష్ణగిరి, పుదుకోట జిల్లాల్లో తలా 4, తిరుచ్చి, తిరువళ్లూర్ జిల్లాల్లో తలా ఓ ప్రాంతంలో కార్చిచ్చు ఏర్పడిందని భారత అటవీ పరిశోధన సంస్థ తెలిపింది.

రూ.20కి పళని పంచామృతం విక్రయం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 5: దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయంలో రూ.20కి పంచామృతం విక్రయాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. ఈ క్రమంలో, పళని అంటేనే పంచామృతానికి ప్రసిద్ధి. స్వామి దర్శనానంతరం పంచామృతం తీసుకెళుతుంటారు. ప్లాస్టిక్ డబ్బాలో 400 గ్రాముల పంచామృతం రూ.40, తగరపు డబ్బాలో రూ.45కు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మినీ డబ్బాలో పంచామృతం విక్రయించాలని భక్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు 200 గ్రాముల పంచామృతాన్ని మినీ డబ్బాలో రూ.20కి విక్రయించేందుకు నిర్ణయించిన ఆలయ నిర్వాహకులు, ఆదివారం నుంచి విక్రయాలు ప్రారంభించారు.

రేపు సహాయ అధికారి పోస్టులకు రాతపరీక్ష

ఐసిఎఫ్, ఫిబ్రవరి 5: వ్యవసాయ, ఉద్యానవన సహాయ అధికారుల పోస్టుల భర్తీకి రాతపరీక్ష బుధవారం టీఎన్‌పీఎస్సీ నిర్వహించనుంది. 84 సహాయ వ్యవసాయ అధికారి, 179 సహాయ ఉద్యానవన శాఖ అధికారి పోస్టుల భర్తీకి నిర్వహించనున్న ఈ పరీక్షకు 3,552 మంది పురుషులు, 1,924 మంది మహిళలు హాజరుకానున్నారు. చెన్నై సహా ఏడు జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

21 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 5: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు, అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో, ఆవడి కమిషనర్ కార్యాలయంలో పనిచేసే నజరత్‌పేట క్రైం విభాగం ఇన్‌స్పెక్టర్ గోపినాథ్ పోలీస్ కంట్రోల్ రూంకు, సాతాన్‌కాడు శాంతిభద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్ జయశంకర్ కేంద్ర క్రైం విభాగానికి బదిలీ అయ్యారు. వీరితో 21 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ శంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేంద్రానికి వ్యతిరేకంగా 10న కాంగ్రెస్ ధర్నా

పెరంబూర్, ఫిబ్రవరి 5: రాష్ట్ర జాలర్లపై శ్రీలంక అమానుషదాడులను అడ్డుకోలేని కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 10న కాంగ్రెస్ ఆధ్వర్యంలో రామేశ్వరంలో ఆందోళన చేపట్టనున్నట్టు టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి పేర్కొన్నారు. సరిహద్దులు దాటారంటూ రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు అధికమవుతున్నాయన్నారు. జాలర్లను అరెస్ట్ చేసి పడవలు స్వాధీనం చేసుకోవడంతో పాటు కొన్ని సమయాల్లో వలలు, యంత్రాలను ధ్వంసం చేస్తున్నారని అన్నారు. శ్రీలంక దాడులు అరికట్టేలా కేంద్రం చర్యలు చేపట్టాలని పలుమార్లు కోరినా ఫలితం లేకపోగా, వేటకు వెళ్లాలంటేనే జాలర్లు భయపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. శ్రీలంక నావికాదళం దాడులు అడ్డుకోలేని కేంద్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రామేశ్వరం పాంబన్ బస్‌స్టేషన్ సమీపంలోని అన్నై ఇందిరా జాతీయ రహదారి వంతెనపై ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించనున్నట్లు అళగిరి ప్రకటించారు.

18 వరకు క్యాన్సర్ అవగాహన శిబిరం

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంగుడి, ఎంజీఆర్ రోడ్డులో వున్న జెమ్ ఆసుపత్రిలో ఈనెల 18వ తేదీ వరకు క్యాన్సర్ అవగాహన శిబిరం జరుగుతుందని ఆస్పత్రి నిర్వాహకులు ప్రకటించారు. ప్రపంచ క్యాన్సర్ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రారంభమైన ఈ శిబిరం ప్రజా ప్రయోజనం దృష్ట్యా కొనసాగనున్నట్లు వివరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాన్ని సందర్శించవచ్చు. వివరాలకు నెం.7200605493లో సంప్రదించవచ్చు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 5: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.08543 విశాఖపట్టణం -ఎస్ఎంవీటీ బెంగళూరు (వయా.. కాట్పాడి, జోలార్‌పేట) ప్రత్యేక వారాంతపు రైలు ఈ నెల 11, 18, 25, మార్చి 3, 10, 17 24, 31 (ఆదివారం) తేదీల్లో విశాఖపట్టణంలో మధ్యాహ్నం 3.55 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. అలాగే, నెం.08544 బెంగళూరు-విశాఖపట్టణం (వయా.. జోలార్‌పేట, కాట్పాడి) ప్రత్యేక వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 12 19, 26, మార్చి 4, 11, 18, 25, ఏప్రిల్ 1 (సోమవారం) తేదీల్లో బెంగళూరు నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుంది.

● నెం.07153 నరసాపూర్ - బెంగళూరు స్పెషల్ (వయా... కాట్పాడి, జోలార్‌పేట) ఈ నెల 9, 16, 23, మార్చి 1, 8, 15, 22, 29 (శుక్రవారం) తేదీల్లో నరసాపూర్ నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. అలాగే, నెం.07154 బెంగళూరు-నరసాపూర్ స్పెషల్ (వయా... జోలార్‌పేట, కాట్పాడి) ఈ నెల 10, 17, 24, మార్చి 2, 9, 16, 23, 30 తేదీల్లో బెంగళూరు నుంచి ఉదయం 10.50కి మరుసటిరోజు ఉదయం 6 గంటలకు నరసాపూర్ చేరుకుంటుంది.

రెండాకుల గుర్తుపైనే పోటీ...!

● ఓపీఎస్ ధీమా

ప్యారీస్, ఫిబ్రవరి 5: అన్నాడీఎంకే కార్యకర్తలందరూ తమకే మద్దతుగా ఉన్నారని, పార్లమెంటు ఎన్నికల్లో రెండాకుల గుర్తుపైనే పోటీ చేయనున్నట్లు మాజీ మంత్రి, అన్నాడీఎంకే బహిష్కృత నేత ఒ.పన్నీర్‌సెల్వం చెప్పారు. మదురై కమలాంబాళ్ మండపంలో సోమవారం ఉదయం ఓపీఎస్ మద్దతుదారుల సమావేశం మాజీ ఎంపీ గోపాలకృష్ణన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఓపీఎస్ పాల్గొని మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల ద్వారా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవిని ఎంపిక చేయాలని దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ పార్టీ ప్రారంభించిన సమయంలో రూపొందించిన అజెండాలో స్పష్టంగా ఉందని, అయితే అన్నాడీఎంకేకి ప్రధాన కార్యదర్శిగా ఎడప్పాడి పళనిస్వామిని సర్వసభ్య సమావేశం ఎంపిక చేయడంపై పార్టీలోని వేలాది మంది కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత భౌతికంగా లేకపోయినా, అన్నాడీఎంకేకు శాశ్వత ప్రధాన కార్యదర్శి ఆమేనని, ఆమె అమలు పరచిన పథకాలను ప్రచారంగా ప్రజల్లోకి తీసుకెళ్లి పార్లమెంటు ఎన్నికల్లో రెండాకుల గుర్తుపైనే తాను పోటీ చేస్తామని ఓపీఎస్ స్పష్టం చేశారు.



సభలో ప్రసంగిస్తున్న ఒ.పన్నీర్‌సెల్వం

'ఎన్ మన్..ఎన్ మక్కళ్' పాదయాత్రలో అన్నామలై



సభలో ప్రసంగిస్తున్న అన్నామలై

వేలూరు, ఫిబ్రవరి 5: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేపట్టిన 'ఎన్ మన్... ఎన్ మక్కళ్' పాదయాత్ర 87వ రోజు నగరంలో జరిగింది. కాట్పాడి సహా నగరంలోని పలు ప్రాంతాల్లో అన్నామలై పాదయాత్రలో పుదియ నీతి కట్చి అధ్యక్షుడు ఏసీ షణ్ముగం, బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాత్యాయని, జిల్లా అధ్యక్షుడు మనోహరన్, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం 'ఉడాన్' పథకంలో వేలూరు విమానాశ్రయాన్ని రూ.64 కోట్లతో ఏర్పాటు చేస్తోందని, త్వరలోనే ఈ విమానాశ్రయం ప్రజల అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు.

మెదడు నిర్జీవమైన డ్రైవర్ అవయవదానం



రుద్రకోటి (ఫైల్‌ఫొటో)

వేలూరు, ఫిబ్రవరి 5: స్థానిక వాలాజా ఆవరకరై పిళ్లయార్ వీధికి చెందిన కారు డ్రైవర్ రుద్రకోటి. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న రుద్రకోటి ప్రమాదానికి గురికావడంతో, ఆయన్ను సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక సోమవారం రుద్రకోటి మెదడు నిర్జీవం కావడంతో, ఆయన అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో శస్త్రచికిత్స ద్వారా గుండె, ఊపిరితిత్తులను తొలగించి చెన్నై అపోలో, చెన్నై మలర్ ఆసుపత్రులకు, కిడ్నీలు అపోలో, గ్లోబల్ ఆసుపత్రులు, పేగులను సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. కాగా, రుద్రకోటి భార్య 10 ఏళ్ల క్రితం మృతిచెందగా, వారికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడున్నాడు.

ఘనంగా విద్యామందిర్ వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఫిబ్రవరి 5: స్థానిక కొసపేట ఉత్తర మాతా ఆలయ వీధిలో ఉన్న విద్యా మందిర్ మెట్రిక్ పాఠశాల 38వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం జరిగింది. వేడుకలకు టెక్నికల్ విద్య మాజీ ఉపాధ్యాయుడు సచ్చిదానందం ముఖ్యఅతిథిగా పాల్గొని, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకలకు పాఠశాల కరస్పాండెంట్ సూర్య అధ్యక్షత వహించగా, ప్రిన్సిపాల్ లావణ్య ఆహ్వానం పలికారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఉపాధ్యాయులు అరుల్ సెల్వి, శివ, బేబి ప్రియ, అరుణ్, ఆనందన్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఫిబ్రవరి 5: స్థానిక ఇండియన్ సైన్స్ సమాఖ్య ఉద్యోగుల కార్యాలయం సరోజిని ఇల్లంలో రచయితల పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి జిల్లా సెక్రటరీ సురేంద్రన్ అధ్యక్షత వహించగా, రచయిత ముల్లైవాసన్ ప్రసంగించారు. తమిళనాడు సైన్స్ ఇయక్కం జిల్లా సెక్రటరీ జనార్ధనన్, రచయిత బాబు, ధర్మన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా అకౌంట్స్ అధికారి ముత్తుశిల్పన్, ఎస్.మరకతం, ముల్లైవాసన్ సహా పలువురు రచయితలు పాల్గొన్నారు.

250 కిలోల నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులు

వేలూరు, ఫిబ్రవరి 5: కార్పొరేషన్ కమిషనర్ ఉత్తర్వులతో 1వ మండల పారిశుధ్య అధికారి శివకుమార్ నేతృత్వంలో సిబ్బంది కాట్పాడి రైతు బజార్ సహా సమీపంలోని 15 దుకాణాల్లో తనిఖీలు చేపట్టింది. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకొని, మూడు దుకాణ యజమానులకు తలా రూ.1,000 జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరించారు.

శ్రీలంక ఖైదీల నుంచి ఏడు సెల్‌ఫోన్ల స్వాధీనం

● పుళల్ జైలు అధికారుల వెల్లడి

ప్యారీస్, ఫిబ్రవరి 5: స్థానిక పుళల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న శ్రీలంకకు చెందిన ఖైదీల నుంచి ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆ జైలు అధికారులు తెలిపారు. పుళల్ కేంద్ర కారాగారంలో సుమారు 3,000 మందికి పైగా ఖైదీలున్నారు. ఇటీవల కాలంగా ఖైదీలు చట్టవిరుద్ధంగా సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారంటూ అందిన సమాచారంతో జైలు అధికారులు అన్ని జైళ్లలో తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం పుళల్ జైలులో శ్రీలంక ఖైదీలకు కేటాయించిన గదిలో తనిఖీలు నిర్వహించిన అధికారులు, సుజాంతన్, పుష్పరాజ్, వర్ణకులక్షత్రియన్, గురుకుల సూర్య, నిశాంత్, సురాంక, లాడియా, రోషన్ వినియోగించిన సెల్‌ఫోన్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అందజేసిన ఫిర్యాదు మేరకు పుళల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

● మెకెదాటు డ్యాం వ్యవహారం
పాండ్యన్ నేతృత్వంలో నకలు దహనం



కావేరి నిర్వహణ మండలి సమావేశం అజెండా నకళ్లను దహనం చేస్తున్న రైతులు

పెరంబూర్, ఫిబ్రవరి 5: కావేరి నదిపై మెకెదాటు డ్యాం వ్యవహారంపై తంజావూరు కలెక్టర్ కార్యాలయం ముందు పీఆర్ పాండ్యన్ నేతృత్వంలో రైతులు సోమవారం నకళ్ల దహనం చేసి నిరసన తెలిపారు. ఈనెల 1న జరిగిన కావేరి నిర్వాహక మండలి సమావేశంలో మెకెదాటు డ్యాం నిర్మాణానికి సంబంధించి కర్ణాటక ప్రభుత్వం ప్రణాళికను తయారుచేసి ఆమోదం కోసం సమర్పించింది. కర్ణాటక తీరుపై రాష్ట్ర జలవనరులశాఖ కార్యదర్శి సందీప్ సక్సేనా అభ్యంతర తెలిపారు. రాష్ట్రప్రభుత్వ అభ్యంతరం పట్టించుకోని మండలి అధ్యక్షుడు దాన్ని ఆమోదానికి ఉంచగా, రాష్ట్ర ప్రతినిధులు కూడా పాల్గొన్నట్టు తెలిసింది. దీనిపై రాష్ట్ర రైతు సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగా, అత్యున్నత న్యాయస్థానాన్ని అవమానించేలా కావేరి నిర్వాహక మండలి సమావేశంలో కర్ణాటక ప్రణాళికను ఎలా ప్రవేశపెడతారని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మండలి తీరును నిరసిస్తూ తమిళనాడు రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పీఆర్ పాండ్యన్ నేతృత్వంలో రైతులు, సమావేశం అజెండా నకళ్లను దహనం చేసి నిరసన తెలిపారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ దీపక్ జాకబ్‌కు అందించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, ఫిబ్రవరి 5: స్థానిక కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం సోమవారం జరిగింది. రాష్ట్ర మంత్రి దురైమురుగన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, ఉప మేయర్ సునీల్ కుమార్, కమిషనర్ జానకి రవిచంద్రన్, కౌన్సిలర్లు, మండల కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు. సమావేశంలో కార్పొరేషన్‌లో చేపడుతున్న పనులు, నాణ్యత పాటింపు, పనులు ముగిసే కాలం తదితరాలపై చర్చించారు.

రూ.3.94 లక్షల విలువైన కృత్రిమ కాళ్ల పంపిణీ



కృత్రిమ కాళ్లు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఫిబ్రవరి 5: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ జరిగింది. సమావేశంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కొత్త రేషన్‌కార్డులు, ఇళ్లపట్టాలు, పట్టా మార్పిడి, వితంతు పింఛన్ మంజూరు సహా 320 మంది వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముగ్గురు దివ్యాంగులకు రూ.3.94 లక్షల విలువైన కృత్రిమ కాళ్లను కలెక్టర్ సుబ్బులక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ సబ్ కలెక్టర్ కలియమూర్తి, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెన్నై పర్యటన వాయిదా



ప్యారీస్, ఫిబ్రవరి 5: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి డీఎంకేతో సీట్ల సర్దుబాటు చర్చల్లో పాల్గొనేందుకు ఈనెల 13వ తేది నగరానికి రావాల్సిన ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పర్యటన వాయిదా పడినట్లు టీఎన్‌సీసీ తెలిపింది. పార్లమెంటుకు ఎన్నికల నేపథ్యంలో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలో జాతీయస్థాయిలో ఏర్పాటైన 'ఇండియా' కూటమిలో డీఎంకే సహా 20 పార్టీలకు పైగా చేరాయి. ఈ కూటమికి నేతృత్వం వహిస్తున్న మల్లికార్జున ఖర్గే, పలు రాష్ట్రాల్లో పర్యటించి మిత్రపక్షాలతో భేటీయై సీట్ల సర్దుబాటుపై చర్చలు సాగిస్తున్నారు. ఇండియా కూటమిలో తమిళనాడుకు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. సీట్ల సర్దుబాటుకు సంబంధించి చర్చించేందుకు ఆ పార్టీ కోశాధికారి టీఆర్ బాలు నేతృత్వంలో ఓ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీతో గత నెల చివరి వారంలో కాంగ్రెస్ నేతలు తొలివిడతగా సమావేశమయ్యారు. ఈనెల 2వ తేది మలివిడత సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, సీట్ల సర్దుబాటు చర్చల కోసం ఈ నెల 13న మల్లికార్జున ఖర్గే నగరానికి వస్తారని ముందు ప్రకటించారు. అయితే పలు కారణాల వల్ల ఆయన ఈ నెల 18, 19 తేదీల్లో వస్తారని కాంగ్రెస్ శ్రేణులు తెలిపాయి.

నటి జయలక్ష్మికి హత్యా బెదిరింపు

● తిరుమంగళం పోలీసుల విచారణ

ప్యారీస్, ఫిబ్రవరి 5: సినీ నటి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మిని అజ్ఞాతవ్యక్తి సెల్‌ఫోన్‌లో హత్యచేస్తానని బెదిరించిన వ్యవహారంపై స్థానిక తిరుమంగళం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. జయలక్ష్మి అందజేసిన ఫిర్యాదు ఆధారంగా ఇటీవల ఆమెకు సెల్‌ఫోన్ ద్వారా బెదిరించిన వ్యక్తి సెల్‌ఫోన్ నెంబరు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వేలూరు జిల్లా కేవీకుప్పం పంచాయతీ యూనియన్ వడువన్‌తాంగల్‌లో రూ.30 లక్షలతో నిర్మించిన బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్ (చిత్రంలో)ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యే అమ్ములు విజయన్, కేవీ కుప్పం పంచాయతీ యూనియన్ కమిటీ అధ్యక్షుడు రవిచంద్రన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

శ్రీలంకకు అక్రమంగా తరలిస్తున్న నొప్పి నివారణ మందుల స్వాధీనం



పడవలో మందుల పార్శిళ్లు. (ఇన్‌సెట్‌లో) అరెస్టయిన మహమ్మద్ మీర్జా

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా తిరుప్పుల్లాని సమీపం పెరియపట్టినం పుదుమడమ్ పుదుకుడియిరుప్పు సముద్రతీరం నుంచి నాటుపడవల్లో మాదక ద్రవ్యాలను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు సముద్రతీర భద్రతా దళం, నేర నిరోధక దర్యాప్తు విభాగం ఎస్ఐ ఆంటోని సహాయశేఖర్ సిబ్బందితో పెరియపట్టినం సముద్రతీరంలో నిఘా వేశారు. ఆ సమయంలో అక్కడి తీరం వద్ద రెండు ఇంజన్లతో కూడిన ఫైబర్ పడవ వద్ద అనుమానాస్పదంగా నిలిచి ఉన్న మహమ్మద్ మీర్జాను నిర్బంధంలోకి తీసుకుని విచారణ జరిపారు. ఆ పడవ లో దాచిన 12 పార్శిళ్లను విప్పి చూసినప్పుడు అందులో 6.84 లక్షలకుపైగా నొప్పి నివారణ మందులు కనిపించాయి. ఆ నొప్పి నివారణ మందులను శ్రీలంకకు అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. ఆ మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మీర్జాను అరెస్టు చేశారు.

శ్రీలంక నావికాదళం దాడులను ఖండిస్తూ రామేశ్వరం జాలర్ల సమ్మె



జాలర్ల సమ్మెతో రామేశ్వరం తీరంలో నిలిచి ఉన్న పడవలు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం దాడి జరిపి 23 మంది జాలర్ల నిర్బంధించిన సంఘటనను ఖండిస్తూ రామేశ్వరం జాలర్లు సోమవారం సమ్మె చేపట్టారు. ఆదివారం వేకువజాము కచ్చాదీవి, నెడుదీవి నడుమ చేపలుపడుతున్న రామేశ్వరం ప్రాంతానికి చెందిన 23 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం నిర్బంధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ జాలర్లందరినీ కోర్టులో హాజరు పరచి జాఫ్నా జైలుకు తరలించారు. ఈ సంఘటనను ఖండిస్తూ జాలర్లు సమ్మెకు దిగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని తమిళ జాలర్లందరినీ విడిపించాలని సమ్మెలో పాల్గొన్న జాలర్లు, జాలర్ల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

పాక్ చెరలో ఆరుగురు ఎన్నూరు జాలర్లు

● విడిపించాలంటూ విలపిస్తున్న కుటుంబీకులు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గుజరాత్‌కు వెళ్లి, చేపల వేట సాగిస్తూ నడి సముద్రంలో దారీ తెన్నూ తెలియక పాక్ సముద్రజలాల్లో ప్రవేశించి ఆ దేశ నావికదళం నిర్బంధించిన ఎన్నూరు ప్రాంతానికి ఆరుగురు జాలర్లను విడిపించేందుకు చర్యలు చేపట్టాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బాధిత కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నూరు సునామీ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన జాలర్లు రాజన్, కరుణాకరన్, మురుగన్, బాలమురుగన్, అరుళ్‌దాస్, అశోక్ కాంట్రాక్టు పద్ధతిన చేపల వేట సాగిస్తుంటారు. ఆ మేరకు డిసెంబర్ 18న వీరు గుజరాత్‌కు వెళ్ళి అక్కడి పోర్‌బందర్ సముద్రతీరంలో చేపలుపట్టే పనుల్లో చేశారు. డిసెంబర్ 28న ఆరుగురు జాలర్లు సముద్రంలో చేపలుపడుతుండగా పెనుగాలులకు వారి పడవ దారి తప్పి పాకిస్థాన్ సముద్ర జలాల్లోకి ప్రవేశించింది. దీంతో పాక్ నావికాదళం చుట్టుముట్టి వీరిని అరెస్టు చేసి జైలుకు తరలించింది. ఈ విషయాన్ని జాలరి అరుళ్‌దాస్ తన కుమారుడికి సెల్‌ఫోన్ సందేశం ద్వారా తెలిపారు. ఆ విషయం తెలిసినప్పటి నుండి ఆ జాలర్ల కుటుంబీకులు శోకతప్తులయ్యారు. ఆ జాలర్లు పాక్ జైలులో నెల రోజులకు పైగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని విడుదల చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు.

డీఎంకే కూటమిలో సీటు మారనున్న అభ్యర్థులు!

ప్యారీస్, ఫిబ్రవరి 5: మిత్రపక్షాలకు కేటాయించిన సీట్లు తమకే కేటాయించాలంటూ డీఎంకే స్థానిక నేతలు ఆ పార్టీ సీట్ల సర్దుబాటు కమిటీని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి డీఎంకే కూటమిలో నియోజకవర్గాల కేటాయింపుపై డీపీఐ మినహాయించి మిగతా పార్టీలతో తొలివిడత చర్చలు ముగిసి మలివిడత చర్చలు ఈ వారంలో జరగనున్నాయి. ఈ సారి ఎన్నికల్లో ఆ కూటమిలో ఉన్న మిత్రపక్షాలన్నీ తమకు అదనంగా నియోజకవర్గాలు కేటాయించాలని పట్టుబట్టాయి. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో మార్పులు, చేర్పులు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తిరువళ్లూర్, తిరుచ్చి, శివగంగ, విరుదునగర్, కన్నియాకుమారి, తేని , పుదుచ్చేరితో కలిపి 10 నియోజకవర్గాలు కేటాయించారు. వీటిలో తేని మినహా మిగతా అన్ని స్థానాల్లోను ఆ పార్టీ విజయం సాధించింది. అందువల్ల ఈ సారి ఎన్నికల్లో తమకు 12 సీట్లు కేటాయించాలని పార్టీ నాయకులు డీఎంకే అధిష్టానాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పార్టీ జిల్లా నిర్వాహకుల వద్ద ఆయా నియోజకవర్గాల్లో నెలకొన్న పరిస్థితులు అడిగి తెలుసుకొనేందుకు గత రెండు రోజులుగా స్థానిక తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శులు, ఇతర నిర్వాహకులు, గత ఎన్నికల్లో మిత్రపక్షం కాంగ్రెస్‌కు కేటాయించిన నియోజకవర్గాల్లో ఈసారి తప్పనిసరిగా ఉదయించే సూర్యుడు గుర్తుపై పోటీ చేయాలని, కాంగ్రెస్ ఎంపీలు నియోజకవర్గాల వైపు కన్నెత్తి చూడడం లేదని, ఈ కారణం వల్ల ప్రజలు తమను విరోధులుగా చూస్తున్నారంటూ ఏకరువు పెట్టారు. ఈ వ్యవహారాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు డీఎంకే ఎన్నికల కమిటీ నిర్వాహకులు పార్టీ జిల్లా కార్యదర్శులకు హామి ఇచ్చినట్లు తెలిసింది. కాగా, తిరుచ్చి పార్లమెంటు నియోజకవర్గంలో రాష్ట్ర సీనియర్ మంత్రి కేఎన్ నెహ్రూ కుమారుడు పోటీ చేసే అవకాశముందని, ప్రస్తుతం ఈ నియోజకవర్గ ఎంపీ ఎస్.తిరునావుక్కరసు (కాంగ్రెస్) సీటు మారే అవకాశముందని తెలిసింది. ఈ తరహాలోనే గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేటాయించిన స్థానాల్లో అభ్యర్థులను మార్పు చేయడంపై రెండు పార్టీల అధిష్టానాలు కసరత్తు చేపట్టాయి.



చెన్నై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా అవగాహన ప్రచారం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 5: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా తాంబరం, పోరూర్, కేకే నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది.

● **తాంబరం:** రాజకీల్పాక్కం వేళచ్చేరి మెయిన్ రోడ్డు, మెహతానగర్ మెయిన్ రోడ్డు, మారుతి నగర్, గోమతి నగర్, అయ్యప్పనగర్, వేణుగోపాల్ వీధి, అన్నా వీధి, భారతియార్ వీధి, ప్రదీప్ అవెన్యూ, గురునాథర్ వీధి, రంగాకాలనీ, వావూసీ వీధి, మారియమ్మన్ ఆలయ వీధి, శ్యామ్ అవెన్యూ, సెంబాక్కం మెయిన్‌రోడ్డు, మహాశక్తి కాలని, శాంతినగర్, పళనియప్ప నగర్, శివగామినగర్, వీజీపీ శాంతమ్మాళ్ నగర్, ఐఓబీ కాలనీ, క్యాంప్ రోడ్డు, అవ్వై నగర్, మాడంబాక్కం మెయిన్ రోడ్డు, పొన్నియమ్మన్ ఆలయ వీధి, చిన్నయి కాలనీ, కంభర్ వీధి, అంబేడ్కర్ వీధి, రాజీవ్‌గాంధీ నగర్, దుర్గా కాలనీ, వెంకట్రామన్ నగర్, ముత్తమిళ్ నగర్

● **అడయార్:** ఇంజంబాక్కం రాజీవ్‌గాంధీ నగర్, ఖాయిదేమిల్లత్ వీధి, ఆదిత్యరామ్‌నగర్, జె.నగర్, పనమూర్‌కుప్పం, తిరువాన్మియూర్ భారతి నగర్, అవ్వైనగర్, గణపతి నగర్, పాండ్యన్ వీధి, వెంకటేశ్‌పురం, పెరుంగుడి నీలాంగరై, కపాలీశ్వర్ నగర్, అరింజర్ అన్నానగర్ 2 నుంచి 5వ వీధి వరకు, ఎల్లయమ్మన్ ఆలయ వీధి, శివన్ ఆలయ వీధి, కుమరగురు అవెన్యూ, ఐఓటీ శ్రీనగర్ కాలని, గాంధీ మండపం రోడ్డు, అన్నా విశ్వవిద్యాలయం, ఐఆర్ఎస్ చుట్టపక్కల ప్రాంతాలు

● **కేకే నగర్:** దశరథపురం కావేరి రంగన్ నగర్, కేకే రోడ్డు, లోకయ్య కాలనీ, ఆర్కాడు రోడ్డు, బాలాజి నగర్, మదియళగన్ నగర్, సాలిగ్రామం అరుణాచలం రోడ్డు, కుమరన్ కాలని, గాంధీ నగర్, ఎస్ఎస్ఆర్ పంకజం రోడ్డు, వెస్ట్ కేకే నగర్, భరణి కాలని, కావేరి ఆసుపత్రి, సూర్య వీధి, 80 అడుగుల రోడ్డు, పాస్‌పోర్ట్ కార్యాలయం, విరుగంబాక్కం ఎస్ఎస్‌కే లైన్, శ్యామల టవర్, చిన్మయ నగర్, మునుస్వామి వీధి, కస్తూరి వీధి, కామరాజ్ రోడ్డు చుట్టుపక్కల ప్రాంతాలు

● **పోరూర్:** తిరుముడివాక్కం ఎరుమైయూర్, క్రషర్ ఏరియా, కిష్కింద మెయిన్ రోడ్డు, రాజీవ్ నగర్, ఇందిరా నగర్, గురు నగర్, వివేకానంద నగర్, పళంతండలం, నాథన్ వీధి, మాంగాడు నెల్లితోపు, మహాలక్ష్మి నగర్, మారుతి నగర్, జననీ నగర్, మల్లికా నగర్, కొలుమణివాక్కం, రాజీవ్ నగర్, అమ్మన్ నగర్, లక్ష్మి నగర్, కేకే నగర్, అన్నా వీధి, గోవిందరాజు నగర్, ముత్తుకుమరన్ కాలేజ్, గోవూరు, తండలం, ఆదిలక్ష్మి నగర్, మధుర అవెన్యూ, మేనక నగర్, మణిమేడు, ఆకాష్ నగర్, కారపాక్కం



తమిళంలోకి ఎంట్రీ ఇస్తున్న నిహారిక

టాలీవుడ్ హీరోయిన్ నిహారిక తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. 'మద్రాస్ కారన్' అనే మూవీ ద్వారా ఆమె ఎంట్రీ ఇస్తున్నారు. ఎస్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానరుపై నిర్మాత బి.జగదీష్ నిర్మాణంలో 'రంగోలి' ఫేం వాలి మోహన్‌దాస్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తమిళం, మలయాళం భాషల్లో తెరకెక్కించే ఈ చిత్రం వైవిధ్య భరితమైన థ్రిల్లర్ డ్రామాగా రూపొందిస్తున్నారు. తెలుగులో హీరోయిన్‌గా పరిచయమైన నిహారిక.. సినిమాలతో పాటు వెబ్‌సిరీస్‌లలో నటిస్తున్నారు. ఇపుడు ఈ చిత్రం ద్వారా కోలీవుడ్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ చిత్ర షూటింగ్‌ను చెన్నై, మదురై, కొచ్చిన్ తదితర ప్రాంతాల్లో ఒకే షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నారు. భారీ బడ్జెట్‌తో పాటు అత్యాధునిక సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించేలా ప్లాన్ చేశారు.

అరుణరాజా దర్శకత్వంలో విష్ణు విశాల్ కొత్త చిత్రం




అరుణరాజా - విష్ణు విశాల్ - రాహుల్

పలు విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అరుణ రాజా కామరాజ్ దర్శకత్వంలో హీరో విష్ణు విశాల్ ఒక చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రాన్ని రోమియో పిక్చర్స్ బ్యానరుపై నిర్మాత రాహుల్ తెరకెక్కించనున్నారు. నటుడు, దర్శకుడు, గేయరచయిత, నేపథ్యగాయకుడు ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఉన్న అరుణరాజా కామరాజ్... ఇటీవల హీరో ఉదయనిధితో 'నెంజుక్కునీతి' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించారు. లేబుల్ పేరుతో ఒక వెబ్ సిరీస్‌ను రూపొందించగా, ప్రేక్షకాదారణ పొందింది. అయితే, గత కొన్ని రోజులుగా రజనీకాంత్, కార్తీ, విశాల్, నయనతార వంటి అగ్ర నటీనటులతో ఒక చిత్రాన్ని నిర్మించనున్నట్టు వార్తలు వస్తున్నాయి. వీటిని నిజం చేస్తూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. తన తదుపరి ప్రాజెక్టును హీరో విష్ణు విశాల్‌తో కలిసి పని చేయనున్నారు.

చిత్రజ్యోతి

విజయ్ సేతుపతి 51వ చిత్రం టైటిల్ ఇదే...



విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్న 51వ చిత్రానికి 'సత్యమా పొయ్' అనే పేరుతో టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను త్వరలో విడుదల చేయనున్నారు. పి.ఆరుముగ కుమార్ అనే యువ దర్శకుడు తెరకెక్కించి స్వయంగా నిర్మిస్తున్నారు. రుక్మిణి వసంత్, దివ్యా పిళ్ళై, బబ్లూ పృథ్వీరాజ్ తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూర్చుతుండగా ఈ సినిమా మెజార్టీ షూటింగ్‌ను మలేసియాలో చిత్రీకరించారు. కాగా, తన వద్దకు వచ్చే చిన్న పాత్ర అయినా అంగీకరించి నటించేందుకు ముందుకు వస్తున్న విజయ్ సేతుపతి... ఒక వైపు హీరోగా, మరోవైపు ప్రతి నాయక పాత్రల్లో మెప్పిస్తూ రాణిస్తున్న విషయం తెల్సిందే.

నెక్సస్ మాల్‌లో 'సన్-డేస్ కో ఎక్స్‌క్లూసివ్ స్టోర్'



షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధి

అడయార్, ఫిబ్రవరి 5: స్థానిక వడపళనిలోని విజయ నెక్సస్ మాల్‌లో 'సన్-డేస్ కో ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను తాజాగా ప్రారంభించారు. ఫ్యాషన్ ప్రియుల డిమాండ్‌తో పాటు సన్‌గ్లాస్ ఇండస్ట్రీ పురోభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని దీన్ని ప్రారంభించారు. కస్టమైజ్డ్ లైన్సులను డెలివరీ చేయడం, ప్రత్యేకమైన కళ్లద్దాల సేకరణలను అందించడంతో ఈ స్టోర్ ప్రత్యేక నైపుణ్యాన్ని సంతరించుకుంది. డిజిటల్ ప్రపంచంలో ట్రెండ్‌లు వేగంగా అభివృద్ధి చెందుతున్నపుడు వ్యక్తిగతీకరించిన విజన్ సొల్యూషన్, క్యూరేటెడ్ కళ్లజోళ్ల ఎంపికలకు కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా ఈ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను నెలకొల్పారు. ఇందులో దాదాపు 60కి పైగా ప్రీమియం కళ్లద్దాల బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో రేబాన్, ఓక్లీ, వోగ్, బర్‌బెర్రీ, కోచ్, డోల్స్‌గబ్బానా వంటి అనేక బ్రాండ్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

వచ్చే నెలలో వందే భారత్ డీలక్స్ రైలు ట్రయల్ రన్

ఏప్రిల్‌లో పట్టాలపైకి ● గంటకు 200 కి.మీ వేగంతో ప్రయాణం



ఐసీఎఫ్‌లో తయారవుతున్న వందే భారత్ డీలక్స్ రైలు

పెరంబూర్, ఫిబ్రవరి 5: వందే భారత్ డీలక్స్ రైలు మార్చి నెలల్లో పట్టాలెక్కనుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాలను కలిపేలా 39 మార్గాల్లో వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. పూర్తిగా చైర్‌కార్ వసతి అంటే కూర్చొని వెళ్లేలా మాత్రమే ప్రస్తుతం వందేభారత్ రైలు నడుపుతున్నారు. రాష్ట్రంలో చెన్నై - కోవై, ఎగ్మూర్ - తిరునల్వేలి, చెన్నై - మైసూరు మధ్య వందే భారత్ రైళ్లు అందుబాటులో ఉన్నాయి. పడక వసతితో కూడిన వందే భారత్ రైళ్లు తయారుచేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఈ రకం బోగీల తయారీ ఐసిఎఫ్‌లో ముమ్మరంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో, పడక వసతితో కూడిన వందేభారత్ డీలక్స్ రైళ్లు మార్చిలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. తొలుత ఢిల్లీ - ముంబై, ఢిల్లీ - హౌరా, ఢిల్లీ - పట్నాల తదితర నగరాల మధ్య రాత్రి వేళల్లో ఈ రైళ్లు నడపాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. అందుకోసం 10 బోగీల తయారీపనులు ముమ్మరంగా జరుగుతుండగా, మార్చిలో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. పరిశోధనల అనంతరం ఏప్రిల్ 2వ వారంలో ఈ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయమై ఐసిఎఫ్ అధికారులు మాట్లాడుతూ... పడక వసతితో కూడిన వందే భారత్ రైళ్లు ప్రత్యేక వసతులతో పాటు భద్రతా ప్రమాణాలతో తయారవుతున్నాయన్నారు. ఒక్కో రైలు 16 ఏసీ బోగీలతో మొత్తం 850 పడకలు కలిగి, గంటకు 200 కి.మీ వేగంతో నడపనున్నట్లు వారు పేర్కొన్నారు.

కరుప్పనార్ ఆలయంలో ఐదువేల మందికి మాంసాహార విందు





భోజనం తయారు చేస్తున్న వంట మనుషులు - కరుప్పనార్ ఆలయం వద్ద గుమికూడిన భక్తులు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా రాశిపురం తాలూకా పోతమలై వద్దనున్న కళ్లవళి కరుప్పనార్ ఆలయంలో తమిళ మాసం తై చివరి ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఉత్సవాల సందర్భంగా ఐదువేలమంది భక్తులకు మాంసాహార విందు భోజనం వడ్డించారు. పోతమలై చుట్టుపక్కలి గ్రామాల్లో గిరిజనులు, కోయజాతివారు అత్యధికంగా నివసిస్తున్నారు. వీరందరూ యేడాదికోమారు తై నెల చివరి ఆదివారం కరుప్పనార్ ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించి మాంసాహార భోజనం ఆరగించడం ఆనవాయితీ. ఆ మేరకు ఆదివారం సాయంత్రం ఆలయం వద్ద 45 మేకలు, 250 కోళ్ళు, రెండు వేల కిలోల పచ్చిబియ్యంతో సుమారు 50 మంది వంటమనుషులు రుచికరమైన మాంసాహార భోజనం తయారు చేశారు. తొలుత కరుప్పానార్ స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆ ఆలయం వద్ద అందరూ వరుసగా కూర్చుని మాంసాహార భోజనాన్ని ఆరగించారు. విందుకు పుదుపట్టి, నామగిరిపేట, మెట్టలా, ఆయిల్‌పట్టి తదితర గ్రామాల ప్రజలంతా తరలివచ్చారు. సుమారు ఐదు వేలమంది భక్తులు ఈ మాంసాహార విందులో పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జ్ఞానంతో ప్రేరణ పొందాలి

● బిషప్ దేవదాస్ పాత్ర



బిషప్‌లతో దక్షిణ భారత మెట్రోలిటన్ బిషప్ దేవదాస్ పాత్ర

ప్యారీస్, ఫిబ్రవరి 5: మనిషి అంతర్గత ప్రేరణ పొందడం ద్వారా అన్నింటా విజయం సాధించే అవకాశాలున్నాయని దక్షిణ భారత మెట్రోలిటన్ బిషప్ డాక్టర్ దేవదాస్ పాత్ర పేర్కొన్నారు. విల్లివాక్కంలోని ఆంగ్లికన్ చర్చి ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం ఉదయం దేశ సమైక్యత కోసం నిర్వహించిన సదస్సుకు బిషప్ దేవదాస్ పాత్ర అధ్యక్షత వహించారు. ఛత్తీస్‌గఢ్ బిషప్ స్వామినాథు ముఖ్యఅతిథిగా పాల్గొనగా, హైదరాబాద్ బిషప్ సుదీప్‌కుమార్, తెలంగాణ బిషప్ మన్నే పద్మారావు, పంజాబ్ బిషప్ జితేష్ సహా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన ఫాదర్లు, బిషప్‌లు పాల్గొన్నారు. ముందుగా విల్లివాక్కం జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విల్లివాక్కం అన్నై థెరిస్సా నగర్‌లో ఉన్న ఆంగ్లికన్ చర్చిలో ఏర్పాటుచేసిన సదస్సులో దేవదాస్ పాత్ర ప్రసంగిస్తూ... దేశంలోని మైనార్టీ వర్గాలు, లింగ్విస్టిక్ మైనార్టీ భాషలకు కేంద్రప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బీసీ క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, దేశంలో 20 రాష్ట్రాల్లో సిమ్ డయాసిస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బిషప్‌లందరూ కలసి దేశం కోసం ప్రత్యేకంగా ప్రార్థించారు. త్వరలో పార్లమెంటుకు జరగబోయే ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరగాలని, నిరుద్యోగ సమస్యలు తొలగాలని, ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే నాయకులు రావాలని, పోటీపరీక్షలు రాస్తున్న విద్యార్థులు, పబ్లిక్ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కీలంబాక్కంలో త్వరలో హోటల్, ఏటీఎం సెంటర్లు

మంత్రి శేఖర్‌బాబు ప్రకటన ● పోలీసుస్టేషన్‌కు శంకుస్థాపన



కొత్త పోలీసుస్టేషన్ శంకుస్థాపన, భూమిపూజలో పాల్గొన్న మంత్రులు దామో అన్బరసన్, పీకే శేఖర్‌బాబు తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కీలంబాక్కం బస్‌టెర్మినల్ సమీపంలో పేద, మధ్యతరగతి వర్గాల వారికి అందుబాటు ధరలో ఆహార పదార్థాలు లభించే విధంగా ఓ హోటల్‌ను నిర్మించనున్నట్లు చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ) ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. అదే విధంగా జాతీయ బ్యాంకుల ఏటీఎం కేంద్రాలను కూడా త్వరగా ఏర్పాటు చేస్తామన్నారు. సోమవారం ఉదయం కీలంబాక్కం బస్‌టెర్మినల్ వద్ద రూ.14.30 కోట్లతో నిర్మించనున్న కొత్త పోలీసుస్టేషన్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వాహించారు. ఆ సందర్భంగా జరిగిన భూమి పూజలో మంత్రులు దామో అన్బరసన్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా మంత్రి శేఖర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ కీలంబాక్కంలో దక్షిణాది జిల్లాలకు వెళ్లే బస్సులన్నీ సక్రమంగా వెళుతున్నాయని, ప్రయాణికులు కూడా ఈ బస్ టెర్మినల్‌లో లభిస్తున్న సదుపాయాలకు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కోయంబేడు బస్‌స్టేషన్ వద్ద దుకాణాలు నడిపిన 11 మంది కీలంబాక్కం బస్‌స్టేషన్‌లో దుకాణాలు కేటాయించే పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. బస్‌స్టేషన్‌కు చేరువగా రూ.20 కోట్ల తో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు, రూ.70 కోట్లతో కాలినడక వంతెన రహదారి నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ రెండు పనులకు సంబంధించి స్థల సేకరణ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. ఆమ్నీ బస్సులు కీలంబాక్కం నుండే నడపాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఆ ఉత్తర్వును సవాలు చేస్తూ ఆ బస్సుల యజమానులు దాఖలు చేసిన కేసులో హైకోర్టు తీర్పు కోసం తాము ఎదురు చూస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ నగరాభివృద్ధి శాఖ కార్యదర్శి సమయమూర్తి, చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ) మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, తాంబరం పోలీసు కమిషనర్ అమల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి సెమ్మొళి పూంగాలో పుష్ప ప్రదర్శన

అడయార్, ఫిబ్రవరి 5: నగరంలోని సెమ్మొళి పూంగా పుష్ప ప్రదర్శన ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమై వారం రోజుల పాటు కొనసాగనుంది. ఈ ప్రదర్శనలో అరుదైన పుష్పాలను ప్రదర్శనకు ఉంచనున్నారు. సాధారణంగా కొడైక్కెనాల్, ఊటి, ఏర్కాడు వంటి కొండ ప్రదేశాల్లో పుష్ప ప్రదర్శనలు నిర్వహించడం ఆనవాయితీ. అదే తరహా పుష్ప ప్రదర్శనను ఆదివారం నుంచి నగరంలో నిర్వహించేలా రాష్ట్ర హార్టికల్చర్ విభాగం ఏర్పాట్లు చేసింది. స్థానిక జెమిని వంతెన వద్ద ఉన్న ఈ పార్కులో దాదాపు 500కు పైగా అరుదైన పుష్పాలు, మొక్కలకు చెందిన పుష్పాలతో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రయోగశాలలు

● మంత్రి అన్బిల్ మహేశ్

అడయార్, ఫిబ్రవరి 5: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉన్నతస్థాయి సాంకేతిక ప్రయోగశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చి వారిలోని ప్రతిభను వెలికితీయనున్నట్టు రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ వెల్లడించారు. స్థానిక నుంగంబాక్కంలో డీపీఐ ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగిస్తూ... విద్యార్థులకు కొత్త కొత్త అంశాలతో సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలన్నారు. ఏదేని సందేహం వస్తే 14417 అనే టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు ఆ ప్రకారంగా గత యేడాది మార్చి నెల నుంచి జనవరి నెల వరకు 2.96 లక్షల మంది విద్యార్థులు ఈ ఫోను నెంబరుకు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని వెల్లడించారు. 6,218 పాఠశాలల్లో హైటెక్ ల్యాబ్‌లను మరింతగా అభివృద్ధి చేసినట్టు చెప్పారు. ఈ తరహా ప్రయోగశాలలను ప్రాథమికోన్నత పాఠశాలల్లో కూడా ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

రూ.2 కోట్లతో తాగునీటి పథకం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 5: తాంబరం కార్పొరేషన్‌లో రూ.2 కోట్లతో మెట్రో తాగునీటి పథకం పనులు ప్రారంభమయ్యాయి. 29, 30 వార్డుల్లో రాష్ట్ర తాగునీటి సరఫరా బోర్డు ద్వారా పైప్‌లైన్‌లో తాగునీరు సరఫరా చేయాలని స్థానికులు కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేశారు. పమ్మల్ ప్రాంతం నుంచి తిరునీర్‌మలైకి తాగునీటి సరఫరాకు రూ.2 కోట్లతో పైప్‌లైన్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు పూర్తయితే గృహాలకు మూడు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా 5 లక్షల లీటర్లు సరఫరా చేస్తున్నామన్నారు.

ప్రేమలత చేతిపై 'కెప్టెన్' బొమ్మ

● సోషల్ మీడియాలో వైరల్





టాటూ పొడిపించుకుంటున్న ప్రేమలత, ఆమె చేతిపై కెప్టెన్ రూపం

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత తన చేతిపై ఆమె భర్త, పార్టీ దివంగత నేత కెప్టెన్ విజయకాంత్ అందమైన రూపాన్ని టాటూగా ముద్రించుకున్నారు. విజయకాంత్ మృతి చెంది నెల రోజులు దాటినా అభిమానులు కోయంబేడులోని ఆయన సమాధి స్థలాన్ని సందర్శించేందుకు ఇంకా బారులు తీరుతున్నారు. అదే సమయంలో ప్రేమలత కూడా పార్టీ కార్యాలయం వద్దకు వచ్చే అభిమానులకు, పార్టీ ప్రముఖులకు ఎలాంటి ఇబ్బందులు కలగని రీతిలో ఏర్పాట్లు చేపడుతున్నారు. విజయకాంత్ అవసాన దశలో ఆయనకు అండగా నిలిచిన ప్రేమలత ఆయనపై ఉన్న అభిమానాన్ని పలు రకాలుగా చాటుకున్నారు. చివరకు విజయకాంత్‌కు క్రాఫ్ చేసి, తలవెంట్రుకలకు నలుపురంగు పులిమి, ఆయనకు ఇష్టమైన తినుబండరాలను నోటికి అందించటం వరకూ సేవలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె ఉన్నట్టుండి తన చేతిపై కెప్టెన్ అందమైన రూపాన్ని టాటూగా ముద్రించుకున్నారు. ప్రస్తుతం ప్రేమలత టాటా వేయించుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో ముమ్మరంగా వైరల్ అవుతోంది.



కోయంబేడులోని డీఎండీకే కార్యాలయంలో కెప్టెన్ చిత్రపటం వద్ద ప్రేమలతతో కలిసి నివాళి అర్పిస్తున్న సినీ నటి రంభ

వరుసనాడులో బయల్పడిన ప్రాచీన విగ్రహాలు



వరుసనాడు వద్ద లభించిన శిలాశాసనం, శివలింగం - పేచ్చియమ్మాళ్, దక్షిణామూర్తి విగ్రహాలు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా వరుసనాడు వద్ద ఉచ్చిపిళ్ళయార్ గుడి సమీపంలో 13వ శతాబ్దం నాటి శివలింగం, పేచ్చియమ్మాళ్ విగ్రహం, అయ్యనార్ విగ్రహం, దక్షిణామూర్తి విగ్రహం వంటి ప్రాచీన విగ్రహాలు బయల్పడ్డాయి. ఆ జిల్లాకు చెందిన కడలైగుండు ప్రభుత్వ మహోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సెల్వం, కృష్ణగిరి జిల్లా కామన్‌తొట్టి ఉన్నత పాఠశాల తమిళ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, పురావస్తు పరిశోధన శాఖ ఆధ్వర్యంలో జరిపిన తవ్వకాల్లో ఇవన్నీ బయల్పడ్డాయి. ఇదే విధంగా 17వ శతాబ్దం నాటి శిలాశాసనం కూడా బయల్పడింది. ఈ శాసనంలో మదురై చొక్కనాథస్వామికి, పార్వతీదేవికి నేతిని దానం చేసిన సమాచారం చెక్కబడి ఉంది. తవ్వకాల్లో వెలుగుచూసిన విగ్రహాలు, శిలాశాసనం బట్టి అక్కడ పరమేశ్వరుడి ఆలయం ఉండేదని పురావస్తు పరిశోధకుడు సెల్వం తెలిపారు. ఇక పేచ్చియమ్మాళ్ అంటే సరస్వతీ దేవి అని, అందరికీ మాటలను ప్రసాదించే మాత కనుక తమిళంలో ఆమెను పేచ్చియమ్మాళ్‌గా ఆరాధిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే గాకుండా కేరళ, శ్రీలంక, సింగపూరు, మలేసియాలో పేచ్చియమ్మాళ్‌ను ఆరాధిస్తున్నారని వివరించారు.

రోటరీ మద్రాస్ సౌత్‌వెస్ట్ చారియట్ అవార్డుల ప్రదానం



పురస్కారాల విజేతలు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి రోటరీ మద్రాస్ సౌత్‌వెస్ట్ 'చారియంట్ అవార్డ్' పేరిట జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేసింది. స్థానిక ఎగ్మూర్‌లోని ఓ హోటల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమాలో ఈ అవార్డుల ప్రదానం జరిగింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అరవింద్ ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ డి.చంద్రశేఖర్, డి.విజయగోపాల్‌రెడ్డి, డాక్టర్ లింగం గోపాల్, అవిక్షిత్ విజయ్ విశ్వనాథ్, శ్రీవిద్యా వాసుదేవన్‌కు పురస్కారాలను బహూకరించారు.